కొండెక్కిన కోడి



- రూ.300కు చేరిన చికెన్ ధర- సామాన్యులకు భారీ భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కోడి మాంసం ధర కిండెక్కి కూర్చుంది. కిలో చికెన్ ధర రూ.300 చేరింది. దీంతో చికెన్ కొనడం సామాన్యులకు భారీ భారంగా మారింది. ఎండల తీవ్రత వల్ల కోళ్లు చనిపోవడం, డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతోనే చికెన్ ధరలు భారీగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు...

చికెన్ ప్రియులకు ధరల షాక్ తగులుతోంది. మార్కెట్లో చికెన్ కొనాలంటే ముందు పర్సును ఒకటికి రెండుసార్లు తడుముకోవాల్సి వస్తోంది. రికార్డు స్థాయికి చికెన్ ధర చేరుకుంది. తాజాగా బుధవారం మార్కెట్లో కిలో చికెన్ ధర ఏకంగా రూ.300కి చేరింది. గత నెల 10వ తేదీన కిలో చికెన్ ధర రూ.240 ఉంది. గత నెలలో కోడి (లైవ్) కేజీ ధర రూ.120 కాగా, ప్రస్తుతం అది రూ.166కు చేరింది. కర్నూలు నగరంలో స్కిన్‌తో చికెన్ ధర కిలో రూ.280 ఉండగా కాల్చిన కోడి ధర కిలో రూ.290, స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.300 పలుకుతోంది. గత కొన్ని రోజులుగా రోజురోజుకూ ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్యులకు చికెన్ అందుబాటులో లేకుండా పోయింది. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ దాటితే కోళ్లు తట్టుకోలేవు. మార్చి ఒకటి నుంచి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. సరాసరిన 44 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండడంతో వేడికి తట్టుకోలేక అవి చనిపోతున్నాయి. మరోవైపు దంబోరా వ్యాధి కోళ్ల పరిశ్రమలను వెంటాడుతోంది. మార్కెట్లో లేయర్ కోళ్ల కన్నా బ్రాయిలర్ కోళ్లకే డిమాండ్ ఎక్కువ. లేయర్ కోళు కొంతవరకూ ఎండను తట్టుకుంటున్నా బ్రాయిలర్ కోళ్లు మాత్రం ఎక్కువగా చనిపోతున్నాయి. దీంతో, డిమాండుకు తగ్గ ఉత్పత్తి లేక వ్యాపారులు ధర పెంచేశారు. రైతులు నష్టాలను పూడ్చుకునేందుకు తక్కువ బరువు ఉండగానే వచ్చినకాడికి కోళ్లను అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు వేసవి దష్ట్యా ఉత్పత్తిని ఆపేశారు. మరోవైపు కార్పొరేట్ సంస్థల నుంచి పోటీని స్థానిక పౌల్ట్రీ రైతులు తట్టుకోకపోతున్నారు. కార్పొరేట్ కంపెనీల నుంచి దిగుమతి అవుతున్న కోళ్లతో పోల్చితే లోకల్ కోళ్లు తక్కువ బరువు ఉంటున్నాయి. దీంతో, దళారులు అడిగిన ధరకు రైతులు విక్రయించక తప్పడం లేదు. దీంతో చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఎండ వేడిమికి కోళ్లు చనిపోవడం, డిమాండుకు సరిపడా ఉత్పత్తి లేకపోవడంతోనే చికెన్ ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

సరిపడా ఉత్పత్తి లేకపోవడంతోనే..

ఎండలు అమాంతం పెరిగిపోయాయి. ఎండ వేడిమికి కోళ్లు చనిపోతున్నాయి. ప్రజల డిమాండుకు సరిపడా ఉత్పత్తి లేకపోవడంతోనే చికెన్ ధరలు పెరిగిపోయాయి. చికెన్ ధరల పెరుగుదల ప్రభావం వ్యాపారం మీద కూడా పడింది. తక్కువ మొత్తంలో చికెన్ కొనుగోలు చేస్తున్నారు.

- కృష్ణ, చికెన్ వ్యాపారి, కర్నూలు.

పర్సు ఖాళీ అవుతోంది..

ప్రస్తుతం చికెన్ కొనాలంటే పర్సు ఖాళీకాక తప్పడం లేదు. గతంలో ఇంట్లో ఉన్న నలుగురికి కిలో చికెన్ కొనుక్కుని తినేవాళ్లం. కిలో చికెన్ ధర రూ.300కు చేరడంతో ప్రస్తుతం అర కిలోతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

- వీరేష్, ఆదోని.

ఎగ్జిట్ పోల్స్‌తో తికమక

- కొనసాగుతున్న ఉత్కంఠ- అన్ని చోట్లా అదే చర్చ - జోరుగా సాగుతున్న బెట్టింగ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పలు సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్‌తో ప్రజల్లో తికమక నెలకొంది. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయోనని ఎగ్జిట్ పోల్స్ కోసం ఎదురు చూసిన వారికి నిరాశే దక్కింది. అన్ని ఎగ్జిట్ పోల్స్ ఒకే రకంగా లేకపోవడంతో గెలుపోటములపై ఉత్కంఠ కొనసాగుతోంది. మరో వైపు గెలుపోటములపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది...

సార్వత్రిక ఎన్నికల ఘట్టం కీలక దశకు చేరుకుంది. దేశ వ్యాప్తంగా అన్ని దశల ఎన్నికల పోలింగ్ పూర్తయింది. అందరూ ఓట్ల లెక్కింపు కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలకు మే 13న పోలింగ్ నిర్వహించారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎవరు గెలుస్తారు? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే విషయంపై పలు సంస్థలు సర్వేలు చేపట్టాయి. ఎగ్జిట్ పోల్స్ రూపంలో వాటిని శనివారం సాయంత్రం విడుదల చేశాయి. గతంలో దాదాపుగా అన్ని సంస్థలూ దాదాపు ఒకే రకమైన ఫలితాలను ఎగ్జిట్ పోల్స్‌లో ఇచ్చేవి. ఈ సారి ఎన్నికలకు సంబంధించి వందల సంస్థలు సర్వే ఫలితాలను వెల్లడించాయి. కొన్ని సంస్థలు రాష్ట్రంలో వైసిపి గెలుస్తుందని, మరికొన్ని సంస్థలు రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని పేర్కొన్నాయి. దీంతో సామాన్య ప్రజల్లో తికమక నెలకొంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా అదే చర్చ సాగుతోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తమలో తికమకను నెలకొల్పాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్స్‌తో ఫలితాలను తెలుసుకోవాలని అనుకున్న సామాన్యులకు నిరాశే దక్కింది. అన్ని ఎగ్జిట్ పోల్స్ ఒకే రకంగా లేకపోవడంతో గెలుపోటములపై ఉత్కంఠ కొనసాగుతోంది. దీంతో ఈ నెల 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుతో ఎవరు గెలుస్తారోనన్న ఉత్కంఠకు తెర పడనుంది. మరో వైపు గెలుపోటములపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలని తేడా లేకుండా గెలుపోటములపై రూ.లక్షల నుంచి రూ.కోటి వరకు బెట్టింగ్ పెడుతున్నారు. ఏ నియోజకవర్గలో ఎవరు గెలుస్తారంటూ స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. గత ఎన్నికలతో పోల్చి ప్రస్తుత పోలింగ్ సరళి ఎవరికి అనుకూలంగా ఉంటుందో విశ్లేషిస్తున్నారు. నిన్న, మొన్నటి వరకూ కేవలం క్రికెట్ మ్యాచ్‌లకు పరిమితమైన బెట్టింగ్ ఇప్పుడు రాజకీయాల్లోకి కూడా వచ్చింది. రూ.లక్షలతో ప్రారంభమైన బెట్టింగ్‌లు రూ.కోట్లకు చేరుతున్నాయి. ప్రభుత్వం మారుతుందని ఒకవైపు, మరోవైపు అభ్యర్థుల గెలుపు, ఈ రెండింటినీ మించి ప్రధాన పార్టీ అధినేతల మెజారిటీపైనా బెట్టింగులు సాగుతున్నాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, కూటమి మధ్యే రసవత్తర పోరు సాగుతోంది. గతంలో పోలింగ్ జరిగిన మరునాటికి ఏ పార్టీ గెలుస్తుంది, ఏ పార్టీ అధికారంలోకి రావచ్చున్నది పోలింగ్ సరళీ ఆధారంగా విశ్లేషకులు చెప్పగలిగే వారు. కానీ ఈ దఫా ఎన్నికల్లో విశ్లేషకులు సైతం ఓటరు నాడీ పట్టలేకపోతున్నారు. దీనికి తోడు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరడం, ప్రజలు ఓపికగా ఓటు హక్కును వినియోగించుకోవడం, పోస్టల్ బ్యాలెట్లను గతం కంటే ఎక్కువగా ఉద్యోగులు ఉపయోగించుకోవడం, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఓటింగ్‌కు తరలిరావడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతలుగా భావిస్తున్నారు. వాస్తవానికి ఓటింగ్ శాతం పెరిగిందంటే ప్రభుత్వంపై వ్యతిరేకతేనన్న సంకేతాలుగా చెప్పేవారు. కానీ ఈ దఫా ఎన్నికల్లో పెరిగిన ఓటరు చైతన్యం ప్రభుత్వానికి అనుకూలమని వైసిపి అంటుంటే, కచ్చితంగా ప్రభుత్వంపై వ్యతిరేకతేనని కూటమి చెబుతోంది. దీనిపై విశ్లేషకులు కూడా స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది.





ఆర్‌యు స్ట్రాంగు రూముల వద్ద సంతకం చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ఎమర్జెన్సీ వైద్య బృందం ఏర్పాటు

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

ప్రతి బ్లాక్‌లో ఎమర్జెన్సీ వైద్య బృందాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి ఫ్లోర్‌లో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన ఎమర్జెన్సీ ఎక్సిట్‌ను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఆదివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం ఇవిఎం యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫ్లోర్‌లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఎమర్జెన్సీ ఎక్సిట్‌ను ఈరోజు సాయంత్రంలోపు ఏర్పాటు చేయాలని, ఎమర్జెన్సీ ఎక్సిట్ అని తెలిసే విధంగా సైన్ బోర్డు కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి ఎస్‌ఇని కలెక్టర్ ఆదేశించారు. యూనివర్సిటీ లోని 3 బ్లాక్‌లలో ప్రతి ఫ్లోర్‌లో అగ్నిమాపక సిబ్బంది ఒకరిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా మూడు బ్లాక్ లలోని ప్రతి ఫ్లోర్ కారిడార్‌లో ఏసి, తదితర వాటికి సంబంధించిన ఎలక్ట్రికల్ వైర్స్ కనెక్షన్స్‌లో ఎటువంటి లూజ్ కనెక్షన్స్ లేకుండా మరల ఒక్కసారి చెక్ చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి బ్లాక్‌కి ఒక ఎమర్జెన్సీ వైద్య బృందాన్ని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ క్యాంప్, మీడియా సెంటర్ గురించి తెలిసే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని డిఆర్‌ఒ ను కలెక్టర్ ఆదేశించారు. 3బ్లాక్‌లకు కలిపి ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్, అంబులెన్స్ వివరాల గురించి అదే విధంగా ప్రతి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన అబ్జర్వర్ రూమ్‌లు అన్ని సదుపాయాలతో సిద్ధంగా ఉన్నాయా అని డిఆర్‌ఒను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగబాబు, డి ఆర్‌ఒ మధుసూదనరావు, ఆర్ అండ్‌బి ఎస్‌ఇ నాగరాజు, టిడ్కో ఎస్‌ఇ రాజ శేఖర్, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట లక్ష్మమ్మ, కోడుమూరు రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్‌డిఒ శేషి రెడ్డి, పత్తికొండ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ రామలక్ష్మి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించేందుకు రెండవ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అబ్జర్వర్లకు వివరించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి కాన్ఫరెన్స్ హాల్లో జనరల్ అబ్జర్వర్లు జాఫర్, మీర్ తారిఖ్ అలీ సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఇవిఎం, పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్‌కు అవసరమైన సిబ్బందితో పాటు అదనంగా 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుకునే విధంగా కౌంటింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ చేశామన్నారు. అందులో ఇవిఎం టేబుల్‌పై ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్, పోస్టల్ బ్యాలెట్ టేబుల్ పై ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్స్, ఒక మైక్రో అబ్జర్వర్, అబ్జర్వర్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉండేలా కౌంటింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారని జిల్లా ఎన్నికల అధికారి జనరల్ అబ్జర్వర్లకు వివరించారు. అనంతరం ర్యాండమైజేషన్ చేసిన కాపీలపై అబ్జర్వర్లు, జిల్లా ఎన్నికల అధికారి సంతకాలు చేసి అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు పౌష్టిక ఆహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

క్రీడలతో క్రమశిక్షణ

సిలంబం వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపులో డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చిన్నారులను దేశానికి ఉపయోగపడే క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దే సత్తా ఒక్క క్రీడలకు మాత్రమే ఉందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు.కర్నూలు నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన సిలంబం (కర్ర సాము) వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిలంబం (కర్రసాము) క్రీడలో సాధన చేస్తున్న క్రీడాకారులకు పౌష్టిక ఆహారాన్ని అందజేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. ఏ దేశ భవిష్యత్తు అయినా విద్యార్థులు చదువుకునే తరగతి గదిలోనే తయారవుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. ఏ దేశ భవిష్యత్తు కైనా నిజమైన పెట్టుబడి ఈ తరం చిన్నారులే అని చెప్పారు. దేశ భవిష్యత్తు భావిభారత పౌరులైన ఈ తరం చిన్నారుల పైన ఉందని, అందుకే వారిని క్రీడల్లో ప్రోత్సహించడం వల్ల క్రమశిక్షణగల పౌరులుగా ఎదిగి దేశానికి ఉపయోగపడతారని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల చిన్నారుల్లో దేహదారుఢ్యం పెరగడంతో పాటు మానసిక ఆరోగ్యం పెంపొందించ వచ్చని వివరించారు. యోగా, మెడిటేషన్ వంటి ప్రక్రియల వల్ల వారు పరిపూర్ణ ఆరోగ్యంతో సమాజానికి ఉపయోగపడతారన్నారు. వారు అన్ని విధాల అభివృద్ధి చెందుతారని చెప్పారు. మొక్కయి వంగనిది మానై వంగదని సామెత ఉందని అందుకే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చిన్నతనం నుంచే సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దాలని వివరించారు. ప్రస్తుతం సరైన వ్యాయామం లేకపోవడం వల్ల బిపి, షుగర్, అధిక బరువు వంటి జీవనశైలికి సంబంధించిన వ్యాధులకు గురై ఇబ్బందులు పడుతున్నారని, క్రీడల్లో పాల్గొంటే ఇలాంటి సమస్యలు రాకుండా ఉంటాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రతి రోజు ఒక ఆపిల్ పండు ఇవ్వడం వల్ల ఎన్నో రకాల వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. సీజనల్ గా లభించే పండ్లను కూడా తమ పిల్లల ఆహారంలో చేర్చాలని వివరించారు. క్రీడల్లో తమ పిల్లలను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందని కోరారు. కర్నూలు నగరంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని సీనియర్ డాక్టర్ శంకర్ శర్మ చెప్పారు. సిలంబం శిక్షకుడు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

6 వరకు 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలంలోని ఈనెల 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోనిహోసూరు గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి అర్బన్ సీఐ మురళీమోహన్ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా గ్రామాలలో శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే అలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేసినా , రెచ్చగొట్టే వ్యాఖ్యలను మాట్లాడిన వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎస్ఐలు గోపాల్, వెంకటేశ్వర్లు, ఎఎస్ ఐలు, కానిస్టేబుల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

-భారీగా పోలీసు బలగాల మోహరింపు- బందోబస్తులో 2 వేల మంది పోలీసులు
-కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ -ప్రతి చోట సిసి కెమెరాలు ఏర్పాటు
-అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు -కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. జిల్లాలో శాంతియుతం వాతావరణానికి రాజకీయ పార్టీలు, ప్రజలు, మీడియా సహకరించాలన్నారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషటర్ల పై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుందని తెలిపారు. రాయలసీమ యూనివర్సిటి దగ్గర బందోబస్తు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు , ఆరుగురు డిఎస్‌పిలు, 20 మంది సిఐలు, 28 మంది ఎస్‌ఐలు , 84 మంది ఎఎస్‌ఐలు , హెడ్ కానిస్టేబుళ్లు, 120 మంది కానిస్టేబుళు , 40 మంది మహిళా కానిస్టేబుళ్లు, 196 మంది హోంగార్డులు, 87 మంది ఎఆర్ పోలీసులు, 2 స్పెషల్ పార్టీలు, కేరళ స్పెషల్ ఆర్మడు పోలీసు బలగాలు రాయలసీమ యూనివర్సిటి దగ్గర బందోబస్తు విధులలో ఉన్నాయన్నారు.

బందోబస్తు వివరాలు: ఇద్దరు అడిషనల్ ఎస్‌పిలు, 10 మంది డిఎస్‌పిలు, 51 మంది సిఐలు, ముగ్గురు ఆర్‌ఐలు, 73 మంది ఎఎస్‌ఐలు , 9 మంది ఆర్ ఎస్‌ఐలు, 1060 మంది సివిల్ పోలీసులు , 200 మంది ఎఆర్ పోలీసులు , 300 మంది హోంగార్డులు ,జిల్లా పోలీసులతో పాటు ఇతర జిల్లాల పోలీసులతో పాటు, కేంద్ర పోలీసు బలగాలలోని ఎస్‌పిఎఫ్ 20 మంది , ఎస్ఎఆర్ 24 మంది , కేరళ సిఎపిఎఫ్ 1 కంపెనీ, బిఎస్ఎఫ్ 1 కంపెనీ ఈ బందోబస్తు విధులలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 188 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 188 పోలీసు పికెట్స్‌ను ఏర్పాటు చేశాం. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టాటిక్ పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశాం. 91 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు , పోలీసు రూట్ మొబైల్స్‌లతో కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశామని ఎస్‌పి తెలిపారు. 57 క్యూఆర్‌టిలను అన్ని సున్నితమైన పికెట్‌లలో సిఐ, ఎస్ఐ నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 67 రూట్ మొబైల్ టీమ్ లను , 2 కంట్రోల్ రూములు , 14 బాడి ఒన్ కెమెరాలు, 9 వీడియో కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇతర ముఖ్య నేతల కదలికలపై నిఘా ఉంచేందుకు గాను షాడో పార్టీలు, ఎవరైనా సమస్యలు సృష్టిస్తే అటువంటి వారిని గృహ నిర్బంధం చేయుటకు టీమ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. 8 టియర్ గ్యాస్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. లా అండ్ ఆర్డర్ సమస్యలు ఎదురైనా తరుణంలో వాటిని పరిష్కరించుటకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 41 ప్రాంతాలను గుర్తించి కౌంటింగ్ రోజున అన్ని పార్టీ కార్యాలయాలు, పోటీ చేసే అభ్యర్థుల ఇళ్ల వద్ద, ముఖ్య నేతల ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. కర్నూలు పట్టణ శివారులలో 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 31 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. 1775 గ్రామ సభలు నిర్వహించి ఎన్నికల గొడవలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించామన్నారు. 39 ముఖ్యమైన జంక్షన్‌లు గుర్తించామన్నారు. 48 షాడో పార్టీలను , 65 రాత్రి గస్తీ బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 46 మంది పోటెన్సియల్ ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించామన్నారు. సమస్యలు సష్టించే అనుమానమున్న 7,094 మందిని బైండోవర్ చేశామని చెప్పారు. అవసరమైన చోట్ల , అత్యవసరమైన చోట్ల 18 పోలీసుల బలగాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగు జరిగే జిల్లా కేంద్రంతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో, సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా వేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం బాణసంచా నిల్వ ఉంచడం, క్రయ విక్రయాలు చేయడం, కాల్చడం నిషేధమని చెప్పారు. ఎవరైనా అనధికారికంగా మద్యం, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 65 చోట్ల కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. జిల్లా అంతటా కౌంటింగు ముగిసే వరకు 144 సెక్షన్ ఉత్తర్వులను గట్టిగా అమలు చేస్తామన్నారు. నలుగురి కంటే ఎక్కువ ప్రజలు గుమిగూడకూడవద్దని చెప్పారు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా కర్నూలు పట్టణంలో 144 సెక్షను మరియు 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. ప్రజలు అవసరమైతే మాత్రమె తప్ప రోడ్లపైకి రాకూడదని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎవరైనా కౌంటింగ్ సమయంలో అవాంతరాలు కల్పించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లు, అభ్యర్థులు (క్యాండిడేట్స్) ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలన్నారు. ఎన్నిక ఫలితాలు వెలువడిన అనంతరం గెలుపొందిన అభ్యర్థులు వారి మద్దతుదారులు విజ యోత్సవ ర్యాలీలు నిర్వహించడం , డప్పులు వాయిం చడం, పెద్ద శబ్దాలు , బాణ సంచా పేల్చడం వంటివి నిషేధించామని చెప్పారు. గెలుపోటములు సహజమని, ఓడిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడటం, హేళన చేయడం, రెచ్చగొట్టడం చేయ రాదన్నారు. కౌంటింగ్ వేళ అపరిచితులు, అనుమానితులు లాడ్జిల్లో బస చేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 4న జరగబోయే ఓట్ల లెక్కింపునకు జిల్లా పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

రైల్వే శాఖ,నగరపాలక సంస్థ సమన్వయ లోపం

-రైల్వే స్థలాల ప్రక్కన మురుగు కాలువ, తాగునీటి పైపుల మరమ్మతులకు ఆటంకాలు సృష్టిస్తున్న రైల్వే అధికార్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో మురుగు కాలువలు,తాగునీటి పైపుల మరమ్మతుల సమస్యలపై రైల్వే శాఖ, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్) నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అశోక్ నగర్ లో రైల్వే స్టేషన్, కృష్ణానగర్ సమీపంలో కోట్ల రైల్వే స్టేషన్‌తో పాటు దాదాపు 5 కిలోమీటర్ల మేర కర్నూలు నగర పరిధిలో రైల్వే కమ్మీలు విస్తరించి ఉన్నాయి. రైల్వే కమ్మీలకు ఇరువైపులా, కమ్మీల కింది భాగంలో మురికి కాలువలు తాగునీటి పైపులైన్లుఉన్నాయి. వీటి మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు రైల్వే అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని మున్సిపల్ కింది స్థాయి అధికారులు అంటున్నారు. మరమ్మతులు ఆగిపోవడం, ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్, రైల్వే లైన్ల ప్రక్కన బ్రిటిష్ కాలంలో నిర్మించి తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. వాటి మరమ్మతులకు ప్రతిసారి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి సమస్యల పైన గతంలో స్థానిక కార్పొరేటర్లు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి కూడా తెచ్చారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. రెండు రోజుల క్రితం రైల్వే కమ్మీల పక్కన పైప్ లైన్ రిపేరు వచ్చి విఠల్ నగర్‌లో శనివారం నుండి తాగునీటి సమస్య ఏర్పడింది. దేవనగర్ రైల్వే గేటు సమమీపంలో మురుగు నీరు నిలిచి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అశోక్ నగర్‌లో రైల్వే బ్రిడ్జి పక్కన మురుగుకాలువ శిథిలమై ఏళ్లు గడుస్తున్నా రెండు శాఖల అధికారులు స్పందించడం లేదు. దీనివల్ల చిన్న వర్షం వచ్చినా.. బ్రిడ్జి కింద వర్షంనీటితోపాటు మురుగు నీరు నిలిచి ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఇలాంటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలంటే రెండు శాఖల అధికారులు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని పిపిఎస్-ఎస్ కోరింది.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్న దృశ్యం



కౌంటింగ్‌ను విజయవంతంగా పూర్తి చెయ్యండి

పజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చెయ్యాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్లు అనుమతించవద్దని, రౌండ్ల వారీగా ఖచ్చితమైన ఫలితాలను నిర్దేశించిన ప్రొఫా ర్మాలలో ఎన్నికల కమిషన్‌కు నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివరిస్తూ కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో కౌంటింగ్ జరుగుతున్న 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, కౌంటింగ్ హాలులలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చేయాల్సి ఏర్పాట్లు అన్నీ పూర్తి అయ్యాయన్నారు.మీడియా సెంటర్, కమ్యూని కేషన్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ అసిస్టెంట్స్, సూపర్వైజర్స్‌కు రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చామన్నారు. మైక్రో అబ్జర్వర్స్‌కురేపు శిక్షణ ఇస్తామన్నారు.

'అలుపెరగని పోరాటం' పుస్తకావిష్కరణ

- అందుకు అందరూ ఏకం కావాలి
- ప్రబీర్ పుర్కాయస్థా "అలుపెరగని పోరాటం" పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



'అలుపెరగని పోరాటం' పుస్తకాన్ని ఆవిష్కరిసుర్తన్న జయరాజు, మన్సూర్‌రహ్మాన్ , రఘుబాబు , ప్రసాద్ శర్మ తదితరులు

మతోన్మాద శక్తుల అరాచకాలను, వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక అభ్యుదయ వాదులందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం లలిత కళా సమితిలో ప్రబీర్ పుర్కాయస్థా 'అలుపెరగని పోరాటం' పుస్తకాన్ని హైకోర్టు సీనియర్ న్యాయవాది వై.జయరాజు ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన నిర్వహించిన పుస్తకావిష్కరణ సభలో వై.జయరాజు ప్రస్తుత పరిస్థితుల్లో నేడు ఆవిష్కరించిన పుస్తకం చాలా అవసరం అన్నారు. నేటి పరిస్థితులలో సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు అర్థం చేసుకొని ప్రజాస్వామ్య విధానాలను, ఆయన జీవిత విశేషాలు గతం,వర్తమాన పరిస్థితులను సమ్మిళితం చేసుకొని రాసిన పుస్తకం అని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ నుండి నేటి పరిస్థితుల వరకు వివరించారన్నారు. గత పది సంవత్సరాలలో ఎమర్జెన్సీ కన్నా నియంతృత్వ పోకడలను గురించి ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. హిందూ ముస్లింల మధ్య తగాదాలు పెట్టి వారిని రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ఉన్మాద శక్తులు పార్లమెంట్లోని మంద బలాన్ని ఆసరా చేసుకొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కడ ఎవరు ఏది మాట్లాడినా వారిని అరెస్టు చేయడం, జైల్లో పెట్టడం జరుగుతోందన్నారు. ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియా కూడా పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. ఎక్కడ ఏ చర్చ జరిగినా మతాన్ని గురించి చర్చిస్తున్నారన్నారు. మతం ముసుగులో ఏమి మాట్లాడాలో చెబుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ముస్లింలు, దళితులు గిరిజన ప్రాంతాల్లో దాడులు జరుగుతుంటే తెలుగు ప్రజలు మతోన్మాద శక్తులకు తలవంచి ఉదాసీనతతో ఉంటూ గులాములుగా ఉండే విధంగా ఉంటున్నారన్నారు. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆర్థిక అసమానతలు రూపుమాపిననాడే ప్రజాస్వామ్యం మనగలుగుతుందని చెప్పారు. ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ ఎస్.మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ బిజెపిలో ఉన్న ప్రస్తుత పాలకులకు కమ్యూనిజం అన్న, క్రైస్తవులు ,ముస్లింలు, దళితులు అన్నా నచ్చదన్నారు. జాతీయ నాయకులను సైతం తక్కువ చేసి చూస్తున్నారని చెప్పారు. 320 మంది జర్నలిస్టులు జైల్లో మగ్గుతున్నారన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను సైతం జైళ్ళలో ఉంచిన ఘనత బిజెపికే దక్కుతుందన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విరసం నాయకులు పినాకపాణి మాట్లాడుతూ పత్రికలు ఉన్నా లేనట్టుగా మారిన ఈ సమాజంలో ఎలా మసులుకోవాలి అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాజ్యాంగం గురించి మాట్లాడే వాళ్ళంటే మోడీకి రుచించదని, మంద బలాన్ని అడ్డం పెట్టుకొని ఏదైనా చేయవచ్చు అనే భావన ఉందని తెలిపారు. మతం మత్తును మనుషుల్లో ఎక్కించడం వల్ల బిజెపి చాలా భ్రష్టు పట్టిందని చెప్పారు. బిజెపి పుట్టుకతోనే కుల వ్యవస్థపై ఆధారపడి బతికే పార్టీ అన్నారు. కర్నూలు సివిల్ ఫోరం అధ్యక్షులు ప్రసాద్ శర్మ మాట్లాడుతూ సమాచార స్వేచ్ఛ కనుమరుగవుతోందని అన్నారు. పోరాట యోధుల, నిజాయితీ గల రాజకీయ పార్టీల నాయకుల మనుగడ ప్రశ్నార్థకమైందన్నారు. ప్రసార సాధనాలు కార్పొరేట్ వ్యవస్థల్లో ఉన్నవారి చెప్పు చేతుల్లో నలుగుతున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు పీడిత ప్రజలందరూ ఏకం కావాలని, ప్రజలను చైతన్యం చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ మాట్లాడుతూ మీడియా ప్రబీర్ పుర్కాయస్థా జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, తమ భావజాలాలను ప్రకటించడానికి పత్రికలు, మీడియాలు ముందుకెళ్లాలన్నారు. మార్క్స్, లెనిన్ విధానాలే భారతదేశానికి ఉపయోగం అన్నారు. కల్బుర్గి, గౌరీ లంకేష్‌లను, కవులను, రచయితలను, ముస్లింలను అందర్నీ చంపేస్తూ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రభుత్వాలకు భారతదేశంలో ప్రజలను చైతన్యం చేసి, ఉద్యమం చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అసరం ఉందన్నారు. కార్పొరేట్ మత రాజకీయాన్ని అందరూ కలిసి ఎదుర్కోవాలని, బిజెపిని పలచన చేయాలని తెలిపారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ఇన్‌ఛార్జి మధు , ప్రజాసంఘాల నాయకులు, కవులు, రచయితలు, మేధావులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండి ఆనంద్‌బాబు

ఇంటింటికి సామాజిక అవగాహన కల్పిద్దాం

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు

ప్రజాశక్తి- కౌతాళం

దళితపేటల సమస్య లను తెలుసుకుందామని ఇంటింటికి సామాజిక స్పృహను, అవగాహనను పంచుదాం అనే నినాదంతో ప్రతి కెవిపిఎస్ కార్యకర్త దళిత పేటలను సందర్శించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు పిలుపు నిచ్చారు. ఆదివారం కౌతాళం మండల కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు ఎం.చిన్న మారయ్య అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎండి.ఆనంద్ బాబు మాట్లాడుతూ గత రెండున్నర నెలలుగా ఎన్నికల కారణంగా దళితులపై దాడుల పరంపర కొంత కనిపించకపోయినా.. చాప కింద నీరులా అవి కొనసాగుతూనే ఉన్నాయన్నారు. పార్లమెంటు స్థానాన్ని ఎస్‌సిలకు కేటాయించిన అమలాపురం లాంటి ప్రాంతంలోని ఒక ఎస్‌సి కుటుంబం ఆధిపత్య వర్గాల వీధిలో నివాసం ఉన్న కారణంగా ఎలాంటి సౌకర్యాలకు నోచుకోక అనేక అవస్థలు పడి, చివరికి ఓటు వేయడానికి సైతం సిఆర్‌పిఎఫ్ భద్రత మధ్య రావాల్సి వచ్చిందని, అంటే ఎంతటి కఠినమైన కుల దురహంకారం రాజ్యమేలుతుందో దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల జాతరలో ఎవరు గెలుస్తారనేది పక్కన పెడితే, ఎవరూ దళితుల పక్షాన నిలబడరు అనేది మాత్రం వాస్తవం అన్నారు. నిలబడరు అనేవాళ్లను సహితం నీ వైపు మరల్చాలంటే, దానికి ఐక్యత పోరాటం తప్ప వేరే మార్గం లేదన్నారు. అందుకే జూన్ 10 నుండి 30 దాకా ప్రతి కెవిపిఎస్ కార్యకర్త దళిత పేటను సందర్శించి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రతి కుటుంబానికి సామాజిక చైతన్యాన్ని కల్పించి, ఉద్యమించేందుకు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మల్లనహట్టి తాయప్ప, ఉపాధ్యక్షులు ఉరుకుంద వీరేష్, సులేకేరి వీరేష్, బంటకుంట తాయప్ప, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య ఇంకెన్నాళ్లు

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-ఆదోని



ఆదోని పట్టణంలో రోజురోజుకు రోడ్లు ఇరుకుగా మారాయి. వాహనాలు ఉపయోగించే వారి సంఖ్య పెరగడంతో దారులన్నీ రద్దీ అవుతున్నాయి. పట్టణంలో మున్సిపల్ రోడ్డు, పండిట్ నెహ్రూరోడ్డు, గీతా మార్కెట్ ప్రాంతాలు ఎప్పుడు రద్దీగా ఉంటున్నాయి. దుకాణాల ముందు వాహనాల నిలుపుకునేందుకు ఫుట్ పాత్ సదుపాయము లేదు. జనం రద్దీగా ఉంటున్న ఈ రోడ్డులలో రాకపోకలకు తీవ్ర తలనొప్పిగా ఉందిని వాహనదారులు చెబుతున్నారు. శ్రీనివాస భవన్, బాబా ప్లాజా ,పెద్దమసీదు, పెద్ద మార్కెట్ ,దాదాకూల్ డ్రింక్ షాపు, జిబి కాంప్లెక్స్ ప్రాంతాలలో ఎప్పుడూ వాహనాలు అడ్డదిడ్డంగా నిలవడం వల్ల బైకులు వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఉందని పలువురు చెబుతున్నారు.

వన్ వే మరిచారు: ఆదోని పట్టణంలోని మంగళ క్లాత్ స్టోర్ నుండి శరాఫ్ బజార్ వరకు, శ్రీనివాస భవన్ నుండి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు గతంలో వన్‌వే అమల్లో ఉండేది. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు నిబంధనలను గాలికి వదిలేయడంతో ఎప్పుడు రోడ్డు వాహనాలతో రద్దీగా ఉంటుందని అక్కడి వారు చెబుతున్నారు. బళ్లారి, రాయచూరు, సిరుగుప్ప ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు శ్రీనివాస్ భవన్ రోడ్డు గుండానే కొత్త బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి ఉంది. బారి వాహనాలు వచ్చినప్పుడు శ్రీనివాస్ భవన్ రోడ్డు ఇరుకుగా ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతున్న పరిస్థితి ఉంది. అటువైపు వెళ్లాలంటే వాహనాల రద్దీతో ఊసూరు మనాల్సి ఉంటుందని వాహన దారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ రోడ్డే కరువు: ఆదోని పట్టణం నుండి బయటకు వెళ్లేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ రోడ్డు సదుపాయం లేదు. మెయిన్ రోడ్డు గుండానే పట్టణం దాటాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే రోడ్లు ఎప్పుడు రద్దీగా ఉంటున్నాయి. పాలకులు కనీసం లింక్ రోడ్లు కూడా ఏర్పాటు చేయించలేని స్థితిలో పాలన సాగించారని విమర్శిస్తున్నారు. జనాభాకు అనుగుణంగా పట్టణం విస్తరిస్తున్న రోడ్ల వెడల్పు జరగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు.



రోడ్లు వెడల్పు చేయించాలి: తిప్పన సిఐటియు పట్టణ అధ్యక్షుడు ఆదోని

మురుగు కాలువలపై కూడా కట్టడాలు జరుగుతున్నాయి. స్థలం అన్యాక్రాంతం అవుతుంది. దీంతో రోడ్లు ఇరుగ్గా మారిపోతున్నాయి. దుకాణదారులు సైతం వాహనాలు రోడ్డుపైనే ఉంచాల్సిన పరిస్థితి. దీంతో ట్రాఫిక్ సమస్యతో తీవ్రమై ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్లు వెడల్పు చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలి.



ఇంటిలోసోధా చేస్తున్న పోలీసులు

అనుమానిత ప్రాంతాలలో సోదాలు

ప్రజాశక్తి-ఆదోని

మారణ ఆయుధాలు కలిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైన్ డిఎస్‌పి శ్రీధర్ ధీరజ్ తెలిపారు. ఆదోని వన్‌టౌన్ పరిధిలోని వాల్మీకి నగర్, బోయగేరి ఏరియాల్లో ఎస్‌పి జి.కష్ణ కాంత్, డిఎస్‌పి శివ నారాయణ స్వామి ఆదేశాల మేరకు వన్‌టౌన్ సిఐ తేజోమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడార. మంగళవారం వెలవడనున్న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, లూజు పెట్రోల్, డీజిల్ అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఊరేగింపులు బాణాసంచాలు కాల్చడం, గుంపులు గుంపులుగా తిరగడం వంటివి చేయరాదన్నారు. వీధులలో కేకలు వేసుకుంటూ బైకులు నడప రాదని, అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేయిస్తామన్నారు. ముందు జాగ్రత్త చర్యగా సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసుల పర్యవేక్షణ ఉంచి అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటున్నామన్నారు. పట్టణ ప్రశాంతతకు ప్రజలు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పలు ఇళ్లల్లో క్షుణ్ణంగా హోదాలు చేశామని ఎక్కడ ఎలాంటి హానికరమైన వస్తువులు సామాగ్రి, ఇతర పదార్థాలు దొరకలేదని వివరించారు.

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గెలుపు కోసం ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి- పెద్దకడబూరు



మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి నాలుగవ సారి గెలవాలని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దకడబూరులో సిఎస్ఐ చర్చి లో పాస్టర్ రెవరెండ్ ముత్తుమనోహర్ బాబు బాలనాగిరెడ్డి 4వ తేదీన వెలువడే ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించాలని, రాష్ట్రంలో వైసిపి మరోసారి అధికారంలోకి రావాలని ప్రార్థనలు చేశారు. వైసిపి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పంచి కార్యాక్రమాలు విజయానికి సహకరిస్తాయని , ఆయన మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం వస్తే ఈసారి బాలనాగిరెడ్డికి మంత్రి పదవి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముక్కరన్న, అర్లప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనను ప్రారంభిస్తున్న కొట్టె చెన్నయ్య , పత్తిఓబులయ్య,

ఆకట్టుకున్న సింహానందిని నృత్యం

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

ఆదివారం రాత్రి స్థానిక లలిత కళాసమితిలో శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ నిర్వహించారు. సభను విశ్రాంత ప్రిన్సిపల్ కొట్టే చెన్నయ్య, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. నిర్వాహకులు దేవిశ్రీ సింహానందిని నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆమెను కళాక్షేత్రం తరుపున ఓబులయ్య సన్మానిస్తూ కర్నూలులో ఇటువంటి నృత్యం చేసే ఏకైక మహిళగా అన్నారు. అనంతరం కళానిలయం అధ్యక్షురాలు బెస్త మల్లేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు నేర్చుకున్న పాటలు, కీర్తనలు శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి.

శ్రీ మఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి-మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీ మఠంలో కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చి స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాదారులకు శేషవస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.



పంచ రథోత్సవాల్లో ఊరేగిన రాఘవేంద్రులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామి పంచ రథోత్సవాల్లో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఆదివారం పంచ రథోత్సవాల సేవలు చేయించిన భక్తులచే సంకల్పం చేయించిన అనంతరం ఉత్సవ మూర్తి అయిన ప్రహ్లాద రాయులను రజత గజారోహణం పై, కొయ్య, వెండి స్వర్ణ నవరత్న స్వర్ణ రథాలపై ఆశీనులు చేసి పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పుష్పాలతో అర్చించి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. ఏకాదశి తిథి గడియలు సాయంత్రం 8 గంటలకే వస్తున్న నేపథ్యంలో 7 గంటలకే రథోత్సవాలను నిర్వహించారు.



టిడిపి శ్రేణులు సంయమనం పాటించాలి

-టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

వైసిపి వర్గాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా టిడిపి శ్రేణులు సంయమనం పాటించాలని టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎమ్మెల్యేగా నేను గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 4న ఎన్నికల కౌంటింగ్ రోజున తెలుగుదేశం,బిజెపి,జనసేన అభ్యర్థులు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని జోస్యం చెప్పారు. కౌంటింగ్ సమయంలో నాయకులు, కార్యకర్తలు సహనం కోల్పోకుండా ఉండాలన్నారు. చట్టాన్ని గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా చూడాలని సూచించారు.

బేషిజాలకు పోవద్దు విజయం మనదే

టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మే 13న జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమిదే విజయమనీ, ఎగ్జిట్‌పోల్ సర్వేలన్నీ కూడా ఇదే విషయాన్ని వెల్లడించాయని, ఇక 4వ తేదీ ఎన్నికల లెక్కింపు మాత్రమే మిగిలిఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల కూటమి నూటికి నూరుశాతం గెలుపు ఖాయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, దేశ ప్రధానిగా నరేంద్రమోడి బాధ్యతలు స్వీకరించబోతున్నారని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వెల్లడించారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిటి. నాయుడు, ఆకెపోగు ప్రభాకర్ వై. నాగేశ్వరరావు యాదవ్, డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి, నాగరాజు యాదవ్‌తో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షులు పి.తిక్కారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్‌ను కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన ఎన్నో అప్రజాస్వామిక పద్ధతుల కారణంగా ప్రతిపక్ష తెలుగుదేశంపార్టీ నాయకులనే కాకుండా సామాన్యప్రజానీకాన్ని సైతం వదలలేదన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు బుద్ధిచెప్పి కూటమికి పట్టం కట్టబోతున్నారని అన్నారు. జగన్ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో దుర్మార్గాలను, అరాచకాలను చేయించారని, అయితే ప్రజలు మాత్రం కూటమికే పట్టం కట్టబోతున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక డబలింజన్ సర్కార్ రానున్నందున రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం విస్మరించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. అర్ధాంతరంగా అగిపోయిన పోలవరం పూర్తిచేస్తామని, సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కేంద్ర సహకారాన్ని తీసుకొని అమలు చేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసగించిన జగన్ వల్ల ఎంతో మంది యువకులు రోడ్డున పడ్డారన్నారు. మన ప్రభుత్వం రాగానే ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తామన్నారు. జగన్ పాలనలో కల్తీ మద్యాన్ని అధిక రేట్లు చెల్లించే దుస్థితి ఏర్పడిందని, ఈ కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇసుక, మైనింగ్, డ్రగ్స్ మాఫియాలు వైసిపి పాలనలో సర్వసాధారణమై పోయా యన్నారను. అందుకే వారిని ప్రజలు తిరస్కరించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె. తిరుపాల్‌బాబు, సోమిశెట్టి నవీన్, పి. రవికుమార్, రాజూ యాదవ్, ఎల్లప్ప, డి. జేమ్స్, పి.హనుమంతరావు చౌదరి, ఎస్. ముంతాజ్, నర్సింహులు, గట్టు తిలక్, బేతం క్రిష్ణుడు రామాంజనేయులు పాల్గొన్నారు.



పాలకుర్తి తిక్కారెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ బీటి నాయుడు